'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

గాంధీ బాటలో నడిస్తేనే అభివృద్ధి

కోలేటి దామోదర్
98491 44406

ఏ ఆయుధమూ లేకుండా కేవలం అహింసా సిద్ధాంతంతో క్రూరమైన ప్రభుత్వం మెడలు వంచవచ్చని నిరూపించిన ఏకైక మహనీయుడు మహాత్మా గాంధీ. గాంధీజీ వంటి మహనీయుడు రక్తమాంసాలతో ఈ భూమ్మీద నడయాడాడంటే ముందు తరాల వారికి నమ్మశక్యం కాదని ప్రఖ్యాత శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ అన్నారు. కులమత విద్వేషాలు, అవినీతి, స్వార్థం పెరిగిపోతున్న ఈ కాలంలో గాంధీజీ సిద్ధాంతాలను పాటించడం తప్ప దేశ సమైక్యతకు, సమగ్రతకు, పురోభివృద్ధికి మరో మార్గం లేదన్న విషయాన్ని మనమంతా గ్రహించాలి. గాంధీజీ జయంతి నేపథ్యంలో ఆయన బోధనలను మరోసారి గుర్తుకు తెచ్చుకోవాల్సిన ఆవశ్యకత ఈనాడు మనదేశంలో ఏర్పడింది.

జాతీయోద్యమంలో పాల్గొన్న ఏ నాయకుడి గురించైనా అభిప్రాయ భేదాలు ఉండవచ్చు కానీ, పార్టీలకతీతంగా, మతాలకతీతంగా భారతీయులందరూ మహాత్మాగాంధీని జాతిపితగా ఈనాటికీ గౌరవిస్తున్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, కరెన్సీ నోట్లపై ఆయన బొమ్మను ముద్రించి అత్యున్నత గౌరవాన్నిస్తున్నారు. మన దేశంలోనే కాదు, గాంధీజీ ప్రభావం పాశ్చాత్య దేశాల్లో సైతం ఉన్నది. గాంధీజీ ప్రభావానికిలోనైన ప్రపంచ ఉద్యమ నాయకులలో మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ ఒకరు. ఆయన గాంధీజీ గురించి మాట్లాడుతూ క్రీస్తు మాకు లక్ష్యాలను నిర్దేశిస్తే, వాటిని చేరడానికి మార్గాన్ని గాంధీజీ చూపించారన్నారు. లక్షలాది మంది ఆఫ్రికన్, అమెరికన్ నీగ్రోల హక్కుల కోసం పోరాడటానికి ఆయన గాంధీజీ అహింసా సూత్రాన్ని ఆయుధంగా ఎంచుకుని విజయం సాధించారు.

దక్షిణాఫ్రికాలో నల్ల జాతి ప్రజలకు తెల్లవారి బానిసత్వం నుంచి విముక్తి కలిగించిన పోరాట యోధుడు నెల్సన్ మండేలా కూడా గాంధీజీ సిద్ధాంతాలనే తన పోరాటానికి ఆయుధంగా ఎంచుకున్నారు. తెల్లవారి దౌర్జన్యాలకు భయపడకుండా 20 సంవత్సరాలకు పైబడి జైలు జీవితాన్ని గడిపి, తన లక్ష్యాన్ని సాధించారు. ప్రపంచానికి అంతగా పరిచయంలేని సీజర్ చావెజ్ అనే అమెరికాకు చెందిన ప్రజాహక్కుల నాయకుడు గాంధీజీ మార్గంలోనే పోరాడి, అమెరికాలోని వ్యవసాయ కూలీలకు న్యాయం చేశారు. నిరసనలు తెలియజేయడానికి గాంధేయ మార్గాన్ని మించిన మహాస్త్రం మరొకటి లేదని ఆయన భావించారు. యాజమాన్యాల మెడలు వంచడానికి ఆయన ఒకసారి ఏకంగా 25 రోజుల పాటు నిరాహార దీక్ష చేసి, జాతి నంతటినీ ఏకం చేశాడు. ఆయన గొప్ప నాయకుడుగా ఎదగడానికి గాంధీజీ అహింసా విధానమే ఆయనకు తోడ్పడింది. అయితే, ఈయన గురించి మన దేశంలో చాలా మందికి తెలియదు. ఈయనే కాదు, అమెరికా అధ్యక్షుడిగా పనిచేసిన బరాక్ ఒబామా, ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్‌గా పనిచేసిన యూ థాంట్, ప్రఖ్యాత అమెరికన్ జర్నలిస్ట్ లూయిస్ ఫిషర్ వంటి వారంతా గాంధీజీ అభిమానులే. గాంధీజీ మార్గంలో ప్రయాణించి, వారు గొప్ప గుర్తింపు పొందారు.

ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే మన దేశంలోని గాంధీజీ విగ్రహాలకు ఇంచుమించు సమానంగా అమెరికాలో కూడా ఉన్నాయన్న విషయం చాలా మందికి తెలియదు. ఈనాడు గాంధీజీ సిద్ధాంతాలపై విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్న దేశాలలో అమెరికా ఒకటి. అక్కడ బాగా చదువుకున్నవారంతా గాంధీజీని అభిమానిస్తున్నారు. దీన్ని బట్టి గాంధీజీ ప్రభావం మన దేశంలో కంటే కూడా విదేశాల్లోనే ఎక్కువగా వుందని మనం గ్రహించవచ్చు. విదేశాల్లో గాంధీజీ తాత్వికత సిద్ధాంతాలపై చాలా గొప్ప పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ పరిశోధనలలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న వారిలో ముఖ్యులు జర్మనీకి చెందిన క్రిస్టియన్ బార్ టాల్ఫ్. ఈయన ఎన్నో దేశాలలో విస్తృతంగా పర్యటించి, గాంధీజీ సిద్ధాంతాలను ప్రచారం చేస్తున్నారు. ఆ విధంగా విదేశీయులు సైతం గౌరవించే మరొక మహనీయుడు ప్రపంచంలో మరొకరు లేరు! దీన్ని బట్టి గాంధీజీని ఒక కులానికి, ఒక మతానికి, ఒక ప్రాంతానికి లేదా ఒక దేశానికి చెందిన వ్యక్తిగా భావించలేం. ఆయన యావత్ ప్రపంచ మానవాళికి మార్గనిర్దేశకులు. గాంధీజీ సిద్ధాంతాల ప్రభావంతో ప్రపంచ వ్యాప్తంగా ఉద్యమ పంథాలోనే పెను మార్పులు సంభవించాయి. సాయుధ పోరాటాల కంటే అహింసాయుత పోరాటాల వల్ల విజయాలను సునాయాసంగా సాధించవచ్చని ప్రపంచవ్యాప్తంగా ఉద్యమ నాయకులంతా గ్రహించారు.

> గత శతాబ్ది కాలంలో జరిగిన పోరాటాల్లో సాయుధమైనవి 27 శాతం విజయాన్ని సాధిస్తే, అహింసా మార్గంలో జరిగిన పోరాటాల్లో 51 శాతం విజయం సాధించాయి. ఆ విధంగా గాంధీజీ సిద్ధాంతాలకు క్రమక్రమంగా ఆదరణ పెరుగుతూనే వస్తున్నది.

గాంధీజీ కేవలం స్వాతంత్ర్యోద్యమ నాయకుడు మాత్రమే కాదు, గొప్ప రచయిత కూడా. ఆయన ఇంగ్లీష్, గుజరాతీ, హిందీ భాషలలో ఎన్నో రచనలు చేశారు. ఆయన జీవిత కాలంలో రాసిన పుస్తకాలు, పత్రికా వ్యాసాలు, కరపత్రాలు, ఉత్తరాలు – అన్నీ కలిపి వంద సంపుటాలు అంటే సుమారు 50 వేల పేజీలు 'ది కంప్లీట్ వర్క్స్ ఆఫ్ గాంధీ' పేరుతో మనకు అందుబాటులో ఉన్నాయి. ఆయన స్వాతంత్రోద్యమంలో తలమునకలవుతూనే ఇన్ని రచనలు చేశారంటే ఎవరికైనా ఆశ్చర్యం కలగక మానదు. ఆయన ఎంత విస్తృతంగా, ఎంత వేగంగా రచనలు చేసేవారో ఆ తరువాతి కాలంలో మొత్తం ప్రపంచం ఆయన గురించి అంత తీవ్రంగానూ, అంత లోతుగానూ ఆలోచన చేస్తున్నది. చర్చిస్తున్నది. ఒక అంచనా ప్రకారం మొత్తం ప్రపంచంలో అన్ని భాషల్లో కలిపి ఎక్కువ రచనలు బైబిల్‌కు సంబంధించి ఉండగా, రెండవ స్థానాన్ని గాంధీజీ సాహిత్యం ఆక్రమిస్తున్నది. దీన్ని బట్టి గాంధీజీ రచనలు ఎంతటి విశిష్టమైనవో మనం గ్రహించవచ్చు.

నేడు మహాత్మాగాంధీ జయంతి

గాంధీజీ జర్నలిస్టుగా కూడా మంచి పేరు పొందారు. గాంధీజీ 19 ఏండ్ల వయసులో ఇంగ్లాండ్‌కు వెళ్ళారు. అక్కడ పత్రికలు చదవడం ద్వారా ఆయనకు కొత్త ప్రపంచం పరిచయమైంది. 21 ఏండ్ల వయసులో గాంధీజీ శాఖాహారం విశిష్టతపై తన తొలి వ్యాసాన్ని ప్రచురించారు. భారతదేశం నుంచి ఇంగ్లాండ్ వెళ్లే విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని లండన్ గైడ్ అనే పుస్తకాన్ని ప్రచురించారు. 30 ఏండ్ల వయసులో దక్షిణాఫ్రికాలో 'ఇండియన్ ఒపీనియన్' అనే పత్రికను స్థాపించి, దానికి సంబంధించిన అన్ని పనులను తానే స్వయంగా నిర్వహించేవారు. 1920లో 'యంగ్ ఇండియా', 'నవజీవన్' పత్రికలను ఆయన నడిపారు. 1933లో తన 64 ఏండ్ల వయసులో 'హరిజన్' పత్రికను స్థాపించారు. ఇది ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ, తెలుగు, తమిళం, మరాఠీ, గుజరాతీ, బెంగాలి, ఒడియా భాషల్లో మంచి ప్రాచుర్యం పొంది విజయవంతంగా నడిచింది. ఆయన రోజుకు సాధారణ రాతలో 50 పేజీల వరకు రాసేవారు. ఆయన జీవిత కాలంలో ఒక లక్ష ఉత్తరాలను రాశారట. గాంధీజీ ఒక గొప్ప రచయితగా ప్రపంచంలో గుర్తింపు పొందారు. ఆయన రచనల్లో తొణికిసలాడే మానవతా వాదమే అందుకు కారణం. భారత్‌లోని వివిధ భాషల ప్రసిద్ధ కవులు, రచయితలందరూ ఆయన ప్రభావానికి లోనైన వారే. ఇందుకు రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి మహాకవులు, రచయితలు కూడా మినహాయింపు కాదు.

> సహాయ నిరాకరణ, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా వంటి ఉద్యమాల్లో ఒక వైపు ఉద్ధృతంగా పనిచేస్తూనే, మరొక వంక గాంధీజీ సమాజాన్ని ప్రభావితం చేసే రచనలు చేయడంతో పాటు, దేశ ప్రజలలో సామాజిక పరివర్తన తీసుకురావడానికి ఎంతో కృషి చేశారు.

పారిశుద్ధ్యం గురించి అవగాహన పెంచడం, దేశీయ వ్యవసాయ పరిజ్ఞాన వ్యాప్తి, విజ్ఞాన పరిశోధనలను గ్రామగ్రామానికీ తీసుకెళ్ళడం, మద్యపానం దురలవాటును నిర్మూలించడం, గ్రామ పునర్నిర్మాణం, విదేశీ వస్తు బహిష్కరణతో పాటు, స్వయం సమృద్ధిని సాధించడానికి రాట్నం తిప్పి, నూలు తీసి బట్టలు నేయడంతో పాటు, అనేకానేక కుటీర పరిశ్రమలను నెలకొల్పడం, జాతీయ విద్యావిధానాన్ని రూపొందించి, జాతీయ పాఠశాలలు, కళాశాలలు నెలకొల్పడం వంటి ఎన్నో బృహత్తర కార్యక్రమాలను చేపట్టి, విజయవంతంగా నిర్వహించారు. ఆయన ఉద్యమ ధాటికి ఇంగ్లాండ్‌లో వస్త్ర పరిశ్రమకు పేరుపడ్డ మాంచెస్టర్‌లో బట్టల మిల్లులు మూతపడ్డాయంటే గాంధీజీ ఉద్యమ ప్రభావం ఆనాడు ఎంతగా ఉండిందో మనం గ్రహించవచ్చు. గాంధీజీ ప్రభావంతో నిద్రాణంగా ఉన్న పల్లెలు ఆనాడు చైతన్యాన్ని పొంది, విదేశాల మీద ఆధారపడకుండా స్వయంసమృద్ధిని సాధించాయి. గాంధీజీ ఎంతో నేర్పుగా ఈ స్ఫూర్తిని స్వాతంత్ర్యోద్యమానికి ఇంధనంగా వాడుకుని ఉద్యమాన్ని అహింసాయుత మార్గంలో మరింత ముందుకు తీసుకెళ్ళారు. గాంధీజీ జీవితాంతం ఖద్దరు వస్త్రాలను ధరించడం మాత్రమే కాక, మిల్లు వస్త్రాల వాడకాన్ని పూర్తిగా పరిత్యజించారు.

మన ప్రియతమ నాయకుడు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ గాంధీజీ సిద్ధాంతాలను తూ.చ. తప్పకుండా అమలుచేస్తున్న మహానాయకుడు. దేశానికి గాంధీజీ జాతిపిత అయితే, తెలంగాణ జాతిపిత కేసీఆర్. కులమతాలకు అతీతంగా అందరి శ్రేయస్సును కోరుకునే మానవతావాది కేసీఆర్. కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టినా, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాలు రూపొందించినా, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ ప్రారంభించినా ఇవన్నీ తెలంగాణ ప్రజల సంక్షేమం కోసమే. దళితబంధు, రైతుబంధు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కంటి వెలుగు, ఆసరా పింఛన్లు, కేసీఆర్ కిట్ లాంటి అనేక పథకాలను బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, ఖర్చెంతైనా వెనుకాడక కేసీఆర్ అమలు చేస్తున్నారు. తెలంగాణను మాత్రమే కాక, యావద్దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లడానికి కంకణం కట్టుకున్నారు కేసీఆర్. గాంధీజీ అడుగుజాడల్లో ముందుకు పోతున్న కేసీఆర్‌కు మనమంతా అండగా నిలిచి, దేశాభివృద్ధికి తోడ్పడాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

(వ్యాసకర్త: రాష్ట్ర పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్)

అభివృద్ధికి 'సింగరేణి' వెలుగులు

ప్రదీప్‌రావు ఎరబెల్లి
99660 89696

తెలంగాణ వస్తే కరెంటు ఉండదని, బతుకులు చీకటిమయమవుతాయన్న వెక్కిరింపులకు బీటైన సమాధానమిస్తూ విద్యుత్తు రంగంలో విప్లవం సృష్టించారు సీఎం కేసీఆర్. రాష్ట్రం ఏర్పడి అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడవక ముందే కరెంటు కష్టాలను తీర్చారు. ఇందులో కీలక పాత్ర పోషించిన సంస్థ 'సింగరేణి థర్మల్ విద్యుత్తు ఉత్పత్తి సంస్థ(జైపూర్)'. రాష్ట్ర అవసరాలకు 12 శాతం విద్యుత్తును సమకూరుస్తున్న ఈ సంస్థ థర్మల్ పద్ధతిలోనే కాక సోలార్ పద్ధతిలోనూ విద్యుత్తును ఉత్పత్తి చేస్తూ తెలంగాణ అభివృద్ధిలో తన వంతు బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తున్నది.

దశాబ్దాల స్వరాష్ట్ర సాధన ఉద్యమం వివిధ దశలు దాటుకొని మలిదశ ఉద్యమంగా తెలంగాణ రాష్ట్ర సాధనకు దగ్గరవుతున్న రోజులవి. నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో ఉద్యమనేత కేసీఆర్ నాయకత్వంలో యావత్ తెలంగాణ ఏకమై పిడికిలి బిగించి పోరాడుతున్న రోజులు. తెలంగాణ ప్రజలు ప్రాణత్యాగాలకు సైతం సిద్ధపడి కొనసాగిస్తున్న ఉద్యమ ఉద్ధృతికి ఢిల్లీ పెద్దలు తలొగ్గి రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియకు పూనుకున్న వేళ నాటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ఎగతాళి మాటలు నేటికీ గుర్తు. తెలంగాణ వాళ్లకు పాలన చేతకాదన్న ఆంధ్ర అహంకారపు మాటలకు మరో అడుగు ముందుకేసి తెలంగాణ వస్తే కరెంటు ఉండదు, మీ బతుకులు చీకటిమయమే అంటూ వెక్కిరించిన వైనం. అవును, అప్పటికీ గ్రామాల్లో కరెంటు కోతలు భాగ్యనగరంలో పవర్ హాలిడేల పరిస్థితి. దీనితో ఎట్లా నా తెలంగాణ భవిష్యత్తు అన్న పరేషాన్‌లో తెలంగాణ ప్రజానీకం. ఏం మంత్రం వేశారో ఏమో తెలియదు, రాష్ట్రం ఏర్పడి అధికారంలోకి వచ్చి ఆరునెలలు గడవక ముందే కరెంటు కష్టాలు రూపుమాపారు తెలంగాణ బాపు కేసీఆర్. అనతికాలంలోనే కలలో కూడా ఊహించని విధంగా వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్తు ప్రకటనతో సంచలనం సృష్టించారు. నాటి నుంచి నేటి వరకు పల్లెల్లో, పట్టణాల్లో రెప్పపాటు కాలం కూడా కరెంటు కోత లేకుండా తెలంగాణను యావత్ భారతావనికి టార్చ్‌బేరర్‌గా మార్చిన కేసీఆర్ సంకల్పంలో తనదైన పాత్ర పోషిస్తున్నది సింగరేణి థర్మల్ విద్యుత్తు ఉత్పత్తి సంస్థ(జైపూర్). 2016 సెప్టెంబర్ నెలలో ఈ సంస్థ ప్రారంభమైంది.

ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయ రంగంలో ఆంధ్రా ప్రాంతానికి, తెలంగాణకు భిన్నమైన పరిస్థితులు. కాలువ కింది పారకంలో ఆంధ్రాలో లక్షలాది ఎకరాలు పంట పండుతుండగా తెలంగాణ ప్రాంతంలో నూటికి 90 శాతం బోరుబావులు కరెంటు బావుల కింద సాగయ్యేవి. కరెంటు ఉంటే కానీ పంట పండని పరిస్థితి. అందునా రైతులు ఎక్కువగా సాగు చేసే వరికి సాగునీరు అందించేందుకు కరెంటే కీలకం. వానకాలం ఏదోలా గట్టెక్కినా యాసంగిలో రైతన్నలకు నానా తిప్పలు తప్పేవి కావు.

> ఇగ ఊళ్లల్లో పొద్దున ఆరింటికి పోయిన కరెంటు మళ్ల మాపటేల ఆరు దాటినంక వస్తే అదే అదృష్టం. రాజధాని హైదరాబాద్ నగరంలో పరిశ్రమలదీ అదే పరిస్థితి. ఉమ్మడి రాష్ట్రం చివరి రోజుల్లో ఏకంగా వారంలో నాలుగు రోజులకు పైగా పవర్ హాలిడే. ఎన్నో పరిశ్రమలు మూతపడి వేలాది మందికి ఉపాధిని దూరం చేశాయి.

ఇక ఎట్టకేలకు ఆరు దశాబ్దాల ఉద్యమ ఆకాంక్షలు నెరవేరి స్వరాష్ట్ర సాధన చేరువైతున్న వేళ నాటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి రాష్ట్రం వస్తుందని సంబురపడగానే కాదు కరెంటు లేక చీకటి తెలంగాణగా మారుతుందంటూ చేసిన ఎకిలి ప్రకటన యావత్తు తెలంగాణను ఆలోచనలోకి నెట్టాయి. కానీ రాష్ట్ర అవతరణ అనంతరం ముఖ్యమంత్రి హోదాలో సీఎం కేసీఆర్ అద్భుతాన్ని సృష్టించారు. ఆరు నెలలు తిరగకుండానే కరెంటు కోతలు లేని తెలంగాణను సాధించారు. పవర్ హాలిడేలకే హాలిడే. ఎవరూ ఊహించని విధంగా వ్యవసాయానికి సైతం 24 గంటల ఉచిత విద్యుత్తు ప్రకటన చేసి అమలు చేశారు. కిరణ్‌కుమార్‌రెడ్డి కరెంటు కష్టాలు అంటూ ఎటకారం చేస్తున్న నాడే ఏముంది ఛత్తీస్‌గఢ్ నుంచి రెండు పుల్లలేసి కరెంటు పట్టుకు రావచ్చంటూ నాడు ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ చేసిన ప్రకటన రాష్ట్ర ఏర్పాటు తర్వాత ముఖ్యమంత్రి హోదాలో ఒక మాయ లాగా ఎవరూ ఊహించనివిధంగా సుసాధ్యం చేసి చూపించారు. ఇతర రాష్ట్రాల నుంచి ముందస్తు ప్రణాళికలతో రాష్ట్రానికి అవసరం మేర విద్యుత్తు కొనుగోలు చేశారు. భవిష్యత్తు ప్రణాళికలుగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ద్వారానే కొత్త విద్యుత్తు ఉత్పత్తి సంస్థల ఏర్పాటు ద్వారా విద్యుత్తు విషయంలో దేశానికే ఒక దిక్సూచిలా తెలంగాణను తీర్చిదిద్దారు.

తెలంగాణ ప్రజానీకానికి కరెంటు కష్టాలను దూరం చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పంలో సింగరేణి సైతం తన పాత్ర పోషిస్తున్నది. 2010లోనే ఉమ్మడి రాష్ట్రంలో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి పునాదులు పడ్డా మందకొడిగా సాగుతున్న నిర్మాణ పనులను ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్ ప్రత్యేక దృష్టిపెట్టి పనులు వేగవంతం చేశారు. 2016 సెప్టెంబర్‌లో 1200 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యంతో మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్‌టీపీపీ) ప్రారంభమైంది. 2016 నుంచి విద్యుత్తు ఉత్పత్తి ద్వారా సింగరేణి సంస్థకు ఏటా రూ.500 కోట్లకు పైగా లాభాలు ఆర్జిస్తూ పర్యావరణహిత విద్యుత్తు ఉత్పత్తి సంస్థగా గుర్తింపు పొందుతున్నది జైపూర్ పవర్ ప్లాంట్. దేశవ్యాప్తంగా ఉన్న 250కి పైగా థర్మల్ పవర్ ప్లాంట్లలో నంబర్‌వన్ స్థానంలో నిలుస్తూ వివిధ రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ అవార్డులు సొంతం చేసుకున్నది. ఇప్పటికే 1200 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి కెపాసిటీతో తెలంగాణ రాష్ట్ర విద్యుత్తు వినియోగంలో 12 శాతంపైగా సమకూరుస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ సూచనలతో మరో 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నది. దీని ద్వారా ఎస్‌టీపీపీ కెపాసిటీ 2000 మెగావాట్లకు చేరుకోనున్నది.

ప్రారంభం నాటినుంచి దేశవ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న థర్మల్ విద్యుత్తు కేంద్రాల్లో మొదటి స్థానంలో నిలుస్తూ.. రాష్ట్ర అవసరాలకు 12 శాతం విద్యుత్తును సమకూరుస్తూ.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వివిధ అవార్డులు సాధిస్తూ.. దేశంలోని 250 పైగా విద్యుత్తు ఉత్పత్తి సంస్థల్లో అగ్రస్థానంలో కొనసాగుతూ... థర్మల్ విధానంలోనే కాక సోలార్ విధానంలోనూ మరింత విద్యుత్తును రాష్ట్ర అవసరాలకు సమకూర్చేలా రాష్ట్ర అభివృద్ధిలో ముఖ్య భూమిక పోషిస్తున్నది తల్లి సింగరేణి.

సమన్వయంతో వ్యవహరించాల్సిన పరిస్థితులు రాజకీయ రంగు పులుముకొంటే అవి మారిపోతుంటాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సమన్వయం చేయడానికి రాజ్యాంగబద్ధంగా ఏర్పాటుచేసుకున్న గవర్నర్ వ్యవస్థ రాజకీయాల్లో కూరుకుపోయి అప్రతిష్ఠపాలవుతున్నది. తాజాగా సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్ర క్యాబినెట్ ఉద్యమకారులు దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్రా సత్యనారాయణలను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రకటించాలని సిఫారసు చేస్తే, తిరస్కరిస్తూ గవర్నర్ తమిళిసై తీసుకున్న నిర్ణయం రాజకీయ వర్గాల్లో చర్చకు తెరదీసింది.

గవర్నర్ల జోక్యం ఎందుకు?

జీడిపల్లి రాంరెడ్డి
96666 80051

గవర్నర్ తమిళిసై వ్యవహారం మరోసారి వివాదాస్పదమైంది. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఒక రకంగా, ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో మరోరకంగా వ్యవహరిస్తూ తమకున్న అధికారాలతో రాష్ట్ర ప్రభుత్వాలను ఇబ్బందులు పెట్టే ప్రయత్నం చేస్తున్నది. దేశంలో ఎక్కడా పార్టీల నాయకులు ఎమ్మెల్సీలుగా, రాజ్యసభసభ్యులుగా కానట్టు, గోరంతను కొండంతలుగా చూపే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్రపతి కోటాలో బీజేపీ నేతలు మహేష్ జెఠ్మలానీ, సోనాల్ మాన్‌సింగ్, రాంషఖల్, రాకేశ్ సిన్హా తదితరులు రాజ్యసభ సభ్యులయ్యారు. యూపీలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం జితిన్ ప్రసాద్, గోపాల్ అర్జున్ బూర్జీ, చౌదరీ వీరేంద్రసింగ్, హన్సరాజ్, విశ్వకర్మలను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమించింది. వీరందరికీ లేని తిరస్కారం తెలంగాణలో ఎందుకు జరుగుతున్నది? కేంద్ర అధికార దుర్వినియోగం గవర్నర్ ద్వారా కొనసాగుతుందనడానికి ఇది ప్రత్యక్ష ఉదాహరణ. కేంద్రం తమ అధికార కేంద్రాలుగా గవర్నర్లను వాడుకుంటున్న నేపథ్యంలో గవర్నర్లు, రాష్ట్రాల మధ్య సంబంధాలు దెబ్బతింటున్నాయి.

ఇతర రాష్ట్రాలకు చెందిన, రాజకీయాలకు సంబంధం లేని ప్రముఖ వ్యక్తి గవర్నర్ అయి ఉండాలని సర్కారియా కమిషన్ సిఫారసు చేసింది. రాజకీయాల్లో సంబంధం ఉన్న వ్యక్తికి గవర్నర్ పదవి అప్పజెప్తే రాజకీయాలు చేసే అవకాశం ఉందని వ్యతిరేకించింది. ఆ కమిటీ సిఫారసులను ఎవ్వరూ పట్టించుకున్న పాపాన పోలేదు. తమిళనాడు బీజేపీ అధ్యక్షురాలిగా పనిచేసిన తమిళిసైని గవర్నర్‌గా నియమించడంతో రాజకీయాలకు కేంద్ర బిందువవుతున్నారు. రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాలను తనకున్న విచక్షణాధికారాలను వినియోగించుకుంటూ ఇబ్బందులు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు.

ఈ మధ్యకాలంలో గవర్నర్ల చర్యలు వివాదస్పదంగా మారాయి. కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్‌ఖాన్ యూనివర్సిటీల వైస్‌చాన్స్‌లర్లను మూకుమ్మడిగా తొలగించడం ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు కోపం తెప్పించింది. గతంలో పశ్చిమబెంగాల్‌లో మమత సర్కార్‌కు, అప్పటి గవర్నర్ జగదీప్ ధన్‌కర్‌కు మధ్య ప్రచ్ఛన్న యుద్ధమే సాగింది. తమిళనాడు విద్యార్థులకు నీట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆ రాష్ట్ర శాసన సభ పాస్ చేసిన బిల్లును రాష్ట్రపతికి పంపకుండా గవర్నర్ ఆపి తిరిగి శాసనసభకు పంపారు. తెలంగాణ గవర్నర్ విలేకరుల సమావేశంలో సీఎం కేసీఆర్ గురించి వ్యతిరేక వ్యాఖ్యలు చేయడం వివాదస్పదంగా మారింది. మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే సీఎంగా ఉన్నప్పుడు గవర్నర్ భగత్‌సింగ్ కోశ్యారి మంత్రివర్గ సిఫారసు అంశాలను ఆమోదించకుండా విచక్షణాధికారం పేరిట కాలయాపన చేశారు. ఇలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అనుసంధానకర్తగా ఉండాల్సిన గవర్నర్ పదవి నేడు కేంద్ర రాజకీయాలకు కేంద్ర బిందువుగా మారింది.

> రాష్ట్ర ప్రభుత్వాలు పొరపాటు చేస్తే సరిచేయాల్సిన గవర్నర్లు, రాజకీయాలు చేస్తుండటంతో గవర్నర్ వ్యవస్థ విమర్శలకు తావిచ్చేదిగా తయారైంది. కేంద్రానికి అనుసంధానంగా ఉంటూ, రాష్ట్రాల పరిపాలనలో జోక్యమే ఆ వ్యవస్థకు అప్రతిష్ఠను తెచ్చిపెడుతున్నది. సర్కారియా కమిషన్ సూచనలు అమలుచేస్తే వ్యవస్థలో ఉన్న లోపాలకు పరిష్కారం లభిస్తుంది.

మానవత్వం ఏమైపోతున్నది?

'మషాల్' సినిమాలో దిలీప్‌కుమార్ తన భార్యకు తీవ్ర కడుపు నొప్పి వచ్చినప్పుడు ఆమెను దవాఖానకు తీసుకెళ్లేందుకు వాహనదారుల సాయం అర్థిస్తాడు. స్థానికుల ఇండ్ల తలుపులు తడుతాడు. నా భార్యను కాపాడంటూ అటూ, ఇటు పరుగులు తీస్తాడు. మరోవైపు నొప్పి పెరిగి భార్య పిలుస్తూ ఉంటుంది. ఎవరి సహాయం లభించదు. చివరికి ఆమె ఊపిరి ఆగిపోతుంది. సినిమా చూసేవారిని ఆ సీన్ ఏడిపిస్తుంది. నేడు సమాజంలో జరుగుతున్న కొన్ని అమానవీయ ఘటనలు ఇలాగే 'మనసున్న'వారికి కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. కానీ కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడానికి మనమంతా మానవత్వంతో వ్యవహరించాలని గుర్తు పెట్టుకోవాలి.

ఎండీ మునీర్
99518 65223

మధ్యప్రదేశ్‌లోని మహా నగరంగా పేరొందిన ఉజ్జయినిలో ఇటీవల 12 ఏండ్ల లైంగిక దాడి బాధితురాలు అర్ధనగ్నంగా చిరిగిన బట్టలతో, గాయాలతో స్థానికుల ఇండ్ల తలుపులు తడుతూ, పిలుస్తూ తనను రక్షించాలని వేడుకుంది. కనీసం ఆమె ఎవరు? ఎందుకు తమ ఇంటిముందుకు వచ్చిందని అడిగి తెలుసుకునే ప్రయత్నం ఏ ఒక్కరూ చేయలేదు. ఏదో పని మీద బయటకు వెళ్తున్న ఒకతను భార్యను బయటకు పిలిచేలోపు ఆ అమ్మాయి వెళ్లిపోయింది. ఈ సంఘటన మనుషుల్లో మానవత్వం ఎంతగా కనుమరుగైపోతున్నదో తెలియజేస్తున్నది. మనుషులు ఎంత స్వార్థపరులైపోయారో తెలుపుతున్నది.

ఇదే బీజేపీ అధికారంలో ఉన్న మధ్యప్రదేశ్‌లో ఇటీవల ఒక మహిళను భర్త బట్టలూడదీసి నగ్నంగా గ్రామంలో ఊరేగించాడు. బీజేపీ కార్యకర్త ఒకరు ఆదివాసీ యువకుడి మీద మూత్రం పోశాడు, అటు మణిపూర్ ఇంకా మండుతూనే ఉంది. 165 మందికి పైగా మరణించారు. ఇద్దరు మహిళలను దుండగులు నగ్నంగా ఊరేగించిన సంఘటనను ఎవరు ఇంకా మరిచిపోలేదు. నిజ నిర్ధారణకు వ